క్లుప్తంగా

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

మండల ప్రత్యేకాధికారి లక్ష్మి



సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మి

నాతవరం: నూతన భవన నిర్మాణాలు వేగవంతం చేయడంతోపాటు సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత తీయాలన్నారు. ప్రభుత్వం ఇంకుడు గుంతకు రూ.6 వేలు ఇస్తుందన్నారు. మరుగుదొడ్డి నిర్మించేందుకు అదనంగా రూ.12 వేలు ఇస్తున్న విషయాన్ని మండల వ్యాప్తంగా ప్రచారం చేయాలన్నారు. అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌లకు నూతన భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఇంతవరకు పని చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించిందన్నారు. నాడు – నేడులో చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ పనుల్లో విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుండా క్వాలిటీ కంట్రోల అధికారులు తనిఖీల్లో చర్యలు ఉంటాయన్నారు. పంచాయతీల్లో తాగునీటి సమస్య లేకుండా పర్యవేక్షణ ఉండాలన్నారు. జల జీవన్ మిషన్‌లో ఇంటింటా పైపులైను పనులు సకాలంలో పూర్తి చేసేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో హనుమంత రావు, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, జేఈలు జోగారావు, చంద్రమౌళి, వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చిన బాబు, ఏపీవో చినరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాడుగులలో వీరులకు వందనం



మాట్లాడుతున్న ఎంపీపీ వేమవరపు రామధర్మజ

మాడుగుల: నా మట్టి – నాదేశం, నేల తల్లికి నమస్కారం –వీరులకు వందనంలో భాగంగా నాలుగు మండలాల్లో గ్రామ పంచాయతీల నుంచి సేకరించిన మట్టి, ధాన్యం, కలశాలకు ప్రజాప్రతినిధులు వందనాలు సమర్పించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కలశాలు దేశ రాజధానికి పంపిస్తామని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. ఎంపీడీవో మీనాకుమారి, సర్పంచ్ యడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు కుక్కర మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, దేవరాపల్లి, చీడికాడ, కె. కోటపాడు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొవ్వూరు వీఆర్ఏపై విచారణ

రోలుగుంట: కొవ్వూరు వీఆర్ఏ సీరందాసు ప్రభావతిపై తహసీల్దార్ వరహాలు శనివారం విచారణ చేశారు. ఇక్కడ ఓటరు జాబితా సర్వేకు సంబంధించి 20వ పోలింగు స్టేషన్ పరిధిలో బతికున్న వారిని చనిపోయినట్టుగా ఓట్లు తొలగించినట్టు గ్రామానికి చెందిన బంటు రాజు, మాధవరావు ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రెండు నెలల క్రితం నియోజకవర్గ ఆర్వో ప్రమీలాగాంధీ విచారించి ఉన్నతాధికారులకు నివేదించారు. దీనిపై మరొకసారి తహసీల్దార్ తన కార్యాలయంలో ఫిర్యాదుదారులను, వీఆర్ఏ ప్రభావతిని విచారణ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆయన తెలిపారు.

27న బుచ్చెయ్యపేటలో 'జగనన్నకు చెబుదాం'

తుమ్మపాల : ఈనెల 27వ తేదీన బుచ్చయ్యపేట మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తాం

- వైద్య సేవలను పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన



కె.కోటపాడు: వైద్య సేవలపై ఆరా తీస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కె.కోటపాడు: బి.పి తనిఖీ చేయించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



రోలుగుంట: కె.నాయుడుపాలెంలో పౌష్టికాహారం స్టాళ్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రావికమతం: ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

కె.కోటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష అందరి ఆరోగ్యానికి రక్షగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శనివారం గొండుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోగుల రిజిస్ట్రేషన్, మందుల వివరాలను, వైద్య పరీక్షలను స్వయంగా పరిశీలించారు. వైద్యంతోపాటు రోగులను ఆప్యాయంగా పలకరించి స్థైర్యాన్ని కల్పించడం వల్ల త్వరగా కోలుకుంటారని వైద్యాధికారులకు సూచించారు. వైద్య సిబ్బందితో బీపీ చెక్ చేయించుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. గొండుపాలెం, కొత్తూరు, ముదుగుపాలెం గ్రామాలకు చెందిన 346 మందిని పరీక్షించి మందులు ఇచ్చినట్లు వైద్యాధికారి నిర్మల తెలిపారు.

సంక్షేమంతో ప్రతీ కుటుంబాల్లో వెలుగులు

నాలుగున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాల్లో వెలుగులు నిండాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి సామాజిక పింఛన్ రూ.250 పెంపుతో కలిపి లబ్ధిదారులకు రూ.3 వేలు అందనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సీఎం జగన్ ప్రకటించారన్నారు. అదే నెలలోనే 45 ఏళ్ల దాటిన అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత, నాలుగో విడత డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా నగదును అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్, ఉపాధ్యాయుడు బండారు మంగపతి, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆకుల సాయిప్రసాద్, బండారు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడకూడదన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం కందిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రతి సచివాలయంలో 33 మందికిపైగా వైద్య సిబ్బందితో మంచంపైన రోగులకు సైతం పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. సీఎం జగనన్న ఆశయం మేరకు ప్రతి ఒక్కరూ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మారడానికి కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ కొప్పాక సత్యవతి, ఎంపీటీసీ సీతావరలక్ష్మి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు పాల్గొన్నారు.

రావికమతం: గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యులతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. కొమిరలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం వైద్యులతో తను పరీక్షలు చేయించుకున్నారు. 282 మందికి వైద్య నిపుణులు శరత్‌చంద్ర, ఆర్.జి. పాత్రుడు, వైద్యాధికారులు దుర్గాప్రసాద్, శ్రీరజని, శ్రావ్య పరీక్షించి మందులు ఇచ్చారు.

రోలుగుంట: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. కె.నాయుడుపాలెంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఇక్కడ 334 మంది రోగులకు వైద్య నిపుణులు కె.ఆర్.శ్రావణి, ఆర్. సునీత, ఎస్. విద్యాసాగర్, కె. మౌనికా కావ్యామణి పరీక్షించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి పర్యవేక్షించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మలతో కలిసి విప్ ధర్మశ్రీ పరిశీలించారు. సర్పంచ్ గుములూరి బాబులు, పంచాయతీ కార్యదర్శి లాలం శివ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఎం. కోటపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావుతో కలిసి ఎంపీపీ వేమవరపు రామధర్మజ ప్రారంభించారు. ఇక్కడ 398 మంది రోగులు పరీక్షించారు. వైద్యులు 351 మందికి వివిధ రకాల పరీక్షలు చేశారు. కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీ వైద్యులు కె. లీలాప్రసాదు, ప్రసాదుపాత్రుడు, నాగదివ్య, ప్రత్యేక వైద్యులు కె. సంతోష్‌కుమార్, కె. రేవతి, ఆప్తాలమిక్ అసిస్టెంట్ నాగలక్ష్మి వైద్య సేవలందించారు. ఎంపీడీవో మీనాకుమారి, వైస్ ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ శానాపతి శేషఫణి, ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్, ఎం. కె వల్లాపురం ఉప సర్పంచ్ కరణం రాము, ఎంపీటీసీ సభ్యురాలు కోట్ని సూర్యకుమారి, మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి పాల్గొన్నారు.

మాకవరపాలెం: గిడుతూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఇక్కడ బయ్యవరం, గిడుతూరు గ్రామాలకు చెందిన 563 మంది రోగులకు స్పెషలిస్టు వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మరో 16 మందికి మెరుగైన చికిత్సలు అవసరమని గుర్తించారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గోవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బాలకృష్ణ వైద్య సేవలు పరిశీలించారు. ఎంపీడీవో అరుణశ్రీ, ఎంఈవో మూర్తి, సిహెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

గొలుగొండ: పాతమల్లంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 310 మంది రోగులకు వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో వైద్య సేవలందించారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాజ్జి మాట్లాడుతూ గ్రామాల్లో ఇటువంటి వైద్య సేవలందించడం వల్ల పేదలకు మేలు కలుగుతుందని తెలిపారు. ఎంపీడీవో డేవిడ్‌రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కె.కోటపాడు: పౌష్టికాహార స్టాళ్లు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మాడుగుల రూరల్: ఎం. కోటపాడులో ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ, సర్పంచ్



మాకవరపాలెం: గిడుతూరులో రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ, తదితరులు



గొలుగొండ: రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

చోడవరం: అడ్డూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 380 మందిని వైద్యులు పరీక్షించారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులకు పలు సూచనలు చేశారు. వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండారు సత్యనారాయణ, కార్యదర్శి డాక్టర్ దేవరపల్లి రవి, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

దుర్గాదేవికి డిప్యూటీ సీఎం బూడి పూజలు

బోయిలకింతాడలో భారీ అన్నసమారాధన



దుర్గాదేవిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని బోయిలకింతాడలో దుర్గాదేవి మండపం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాదేవిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, డిప్యూటీ సీఎం తనయుడు వెంకటేష్, పూజ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎంను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. పార్టీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు, మండల వ్యవసాయ శాఖ సలహా సంఘం చైర్మన్ అన్నం రామునాయుడు, స్థానిక పాల సంఘం అధ్యక్షుడు అన్నం సాంబమూర్తి, సీనియర్ నాయకులు అన్నం రాము, సనివాడ రాజు, పడిదెడకల శంకరరావు, గొరపల్లి కృష్ణారావు, దాసరి వెంకటరమణ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగజ్జననీ.. శక్తిస్వరూపిణి



చోడవరంలో శాకంబరి దేవిగా అమ్మవారు




మాడుగుల: దేవీ ఆలయంలో దుర్గాదేవి అలంకరణ



చీడికాడ మండలం అప్పలరాజుపురంలో లలితా త్రిపుర సుందరి దేవిగా..

జగన్మాత అమ్మవారు వాడవాడలా పూజలందుకుంటున్నారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి వివిధ రూపాల్లో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఏడో రోజు శనివారం పలుచోట్ల అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చోడవరంలో శాకంబరిదేవిగా అలంకరించారు. కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. గ్రామానికి చెందిన గల్లా నూకరాజు అనే భక్తుడు వీరికి పలక, పుస్తకాలు, పెన్నులు పంచిపెట్టారు. సీతయ్యపేట దుర్గామల్లేశ్వర ఆలయంలో కుంకుమ పూజలు చేశారు.

- రావికమతం, దేవరాపల్లి, మాడుగుల, మాడుగుల రూరల్, బుచ్చెయ్యపేట, చోడవరం



రావికమతం: కొత్తకోటలో సరస్వతీ దేవిగా దుర్గమ్మ



దేవరాపల్లిలో లలితా త్రిపుర సుందరి అవతారంలో



కె.జె.పురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నసమారాధన

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు కిరణ్

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు నుంచి మాడుగుల వెళ్లే రహదారిలో శనివారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మాడుగులకు చెందిన ఎస్. సులేమాన్ ఎం. కోడూరు నుంచి మాడుగులకు బైకు మీద వస్తున్నాడు. అదే సమయంలో మాడుగులకు చెందిన బి. జయరామ్, కోటేశ్వరరావు, సిహెచ్. కిరణ్ వేరొక బైక్ మీద తమ గ్రామం నుంచి ఎం. కోడూరు వెళ్తుండగా పిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కిరణ్ చేయి, ముఖం మీద బలమైన గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కిరణ్ ప్రస్తుతం మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- వాడవాడలా పోలీసుల ర్యాలీలు, మానవహారం



కె.కోటపాడు: ఎ.కోడూరులో పోలీసులు నిర్వహిస్తున్న ర్యాలీ



మాకవరపాలెంలో ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, నాయకులు



రావికమతం: కొత్తకోటలో ర్యాలీలో పాల్గొన్న సీఐ ఇలియాస్ మహమ్మద్, తదితరులు

రావికమతం: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి త్యాగ ఫలమే మన స్వేచ్ఛా వాయువులని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రావికమతం, కొత్తకోటలో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, వ్యాపారులు, పోలీసులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడళ్లలో మానవహారంగా ఏర్పడ్డారు. అమరవీరుల ఆత్మశాంతికి మౌనం పాటించారు. రావికమతం ఎస్‌ఐ ఉమామహేశ్వర రావు, కొత్తకోట ఉప సర్పంచ్ పందల దేవా, వ్యాపారి నూకేశ్వరరావు పాల్గొన్నారు.

అమరవీరుడి కుటుంబానికి పరామర్శ

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో అమరవీరుడు ఎలిసూరి నాగఅప్పారావు కుటుంబ సభ్యులను కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని పండ్లు, మిఠాయిలు అందించారు. అనంతరం నాగ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిబ్బంది సత్యనారాయణ, కనక పాల్గొన్నారు.

నాతవరం: సమాజంలో పోలీసు పాత్ర చాలా కీలకమని ఇన్‌చార్జి ఎస్‌ఐ రామారావు తెలిపారు. శనివారం స్థానిక మెయిన్ రోడ్డులో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు.

రోలుగుంట: ఎస్సై బి.నాగకార్తీక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, తదితరులు స్థానిక ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ చేపట్టారు. జోహార్..జోహార్.. పోలీసు అమరవీరులకు జోహార్.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు.

మాకవరపాలెం: పోలీసు అమరవీరులకు ఘన నివాళులర్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండు వరకు ఎస్‌ఐ రామకృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేతలు చిటికెల రమణ, పెట్ల దొరబాబు, భీమిరెడ్డి గోవింద పాల్గొన్నారు.

కె.కోటపాడు: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని కె.కోటపాడు, ఎ.కోడూరు ఎస్‌ఐలు ఆర్.ధనుంజయ్, బి.రామకృష్ణ అన్నారు. పోలీస్ సిబ్బందితో కలిసి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. కె.కోటపాడు, ఎ.కోడూరు గ్రామాల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన కుటుంబాలకు అండగా నిలవాలని ఎస్‌ఐలు కోరారు. కె.కోటపాడు ఏఎస్‌ఐ అప్పారావు, కానిస్టేబుళ్లు వంశీ, శ్రీను, అశ్విని పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట: నాగఅప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పించి సీఐ మహమ్మద్



నాతవరంలో ర్యాలీ చేస్తున్న ఎస్‌ఐ రామారావు, ప్రజాప్రతినిధులు సిబ్బంది



రోలుగుంటలో మానవహారంగా ఏర్పడిన పోలీసులు, ఎస్సై నాగకార్తీక్

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



ఆర్.వై.అగ్రహారంలో అంబలం పూజలో పాల్గొన్న డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి



ఖండివరంలో భవానీ అంబలం వద్ద పడి చేస్తున్న భక్తులు



అంబలం భజనలో పాల్గొన్న భవానీ భక్తులు

కె.కోటపాడు: మండలంలో ఆర్.వై.అగ్రహారం, చౌడువాడ గ్రామాల్లో భవానీమాలధారుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అంబలం పూజలు నిర్వహించారు. భక్తులు ఆలపించిన దుర్గాదేవి గీతాలతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆర్.వై.అగ్రహారం కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: చీడికాడ మండలం ఖండివరంలో భవానీ భక్తులు ఆధ్వర్యంలో అంబలం పూజ నిర్వహించారు. ఇక్కడ అమ్మవారి సన్నిధిలో 15 కిలోల లడ్డూ వేలం పాట నిర్వహించగా, బైక్ మెకానిక్ ధనాజీ రూ.15,600కు దక్కించుకున్నాడు. నాయకులు సుంకర శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ పాల్గొన్నారు. మాడుగుల మండలం కె.జె.పురం కళావేదిక వద్ద శుక్రవారం రాత్రి అంబలం భజన చేశారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



తోటాడలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు

మునగపాక : తోటాడ పరిసరాల్లో లో–ఓల్టేజీ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. తోటాడలోని సీతారామ కాలనీ, తారకరామ కాలనీ, పద్మశాలి వీధి తదితర ప్రాంతాల్లో తరచూ ప్రజలు లోఓల్టేజి సమస్యతో సతమతం అవుతున్నారు. దీనిపై సర్పంచ్ దొడ్డి మంగవేణి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు దృష్టికి తీసుకురావడంతో ఆయన సమస్య పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. తోటాడ హైస్కూల్ సమీపంలో ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చెంతనే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి.